రాణాకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యే

స్తంభించిన ట్రాఫిక్

లింగోజిగూడ: రాహుల్ గాంధీపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు శనివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేరుకున్నారు. వీరితో పాటు భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తరలి రావడంతో విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఫిర్యాదు చేయడానికి భారీగా తరలిరావడంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడ్డారని స్థానికులు ఆగ్రహం వ్యకం చేశారు.

వేగంగా సమగ్ర సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ


ఆన్‌లైన్ నమోదును పర్యవేక్షిస్తున్న డీసీ జయంత్

చాదర్‌ఘాట్: సమగ్ర సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగంగా చేపడుతున్నారు. మలక్‌పేట సర్కిల్–6లో అఫ్జల్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు. 100 కంప్యూటర్లు ఏర్పాటు చేసి 110 మంది ఆపరేటర్లను నియమించారు. సర్కిల్ పరిధిలో దాదాపు 53800 ఇళ్ల సర్వే చేసినట్లు డీసీ జయంత్ పేర్కొన్నారు. ప్రతి ఆపరేటర్ రోజుకు 25 పత్రాల వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తామని డీసీ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా సర్కిల్ పరిధిలో 92 శాతం సర్వే పూర్తయింది. మిగతా వాళ్లు స్వగ్రామాల్లో సర్వే వివరాలను అందించగా మరి కొందరు ఇళ్లకు తాళాలు వేసిఉన్నట్లు డీసీ వెల్లడించారు.

ఆంజనేయ స్వామి మహా పడిపూజ


పూజలో పాల్గొన్న భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆంజనేయ స్వామి మాలలో ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆరోగ్య సూత్రాలు కూడా దాగి ఉన్నాయని కాంగ్రెస్ నేత దేప భాస్కర్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లో ఆలేటి కిరణ్ అధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆంజనేయ స్వామి మహా పడిపూజలో దేప భాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మనం పాటిస్తున్న సంస్కృతి సంప్రదాయాలలో మనకు తెలియకుండానే ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నామని అన్నారు. ప్రధానంగా ప్రకృతి పరంగా సంభవించే ప్రమాదాలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే విధంగా హిందూ సాంప్రదాయాలు ఉన్నాయన్నారు. పూజలో స్థానికులు ఉపేందర్ రెడ్డి, రవీందర్, ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ శ్రీశైలం, కల్యాణ్ యాదవ్, సూర్యా, చంద్ర, వెంకట్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ చేయూతనిస్తుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీకి చెందిన దనమ్మకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 2 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను శనివారం ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుందన్నారు. ఈ పథకం పేదలకు వరం లాంటిదని, అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి ముదిరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, బాధితురాలి భర్త ప్రవీన్‌కుమార్, సూరంపల్లి యాదయ్యతపాల్గొన్నారు.

ప్రజాపాలన పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మన్సూరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయి ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలతో రూపొందించిన ప్రజాపాలన పుస్తకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడిన సందర్భంగా అత్యధిక ఓట్లను సాధించిన జక్కిడి శివచరణ్‌రెడ్డి శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి గెలుపొందిన యూత్ కాంగ్రెస్ అభ్యర్థులను సీఎంకు పరిచయం చేయించినట్లు తెలిపారు.

రేవతి కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలి


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నాగోలు: ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటంబానికి రూ. కోటి నష్ట పరిహారం ఇవ్వాలని విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇజ్జగిరి కమలాకర్ డిమాండ్ చేశారు. శనివారం నాగోలు సాయినగర్ అల్కాపురి చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, హీరో అ ల్లు అర్జున్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రేవతి మృతి చెందిందని మృతురాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ గోకికర్, నందల అని ల్ కుమార్ , మహేష్ భాగవతుల, యెచ్చు అనిల్ కుమార్,పాక నవీన్ బాబు, అనికేత్ కోషిగా, ఎడ్ల నరేష్, రషీద్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి మహర్దశ

220 పడకలకు మల్కాజిగిరి ఆసుపత్రి అప్‌గ్రేడ్
- మెడికల్ కాలేజీకి అనుబంధంగా వసతులు
- డయాగ్నస్టిక్ హబ్, రేడియాలజీ ల్యాబ్



మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

సాక్షి,సిటీబ్యూరో: మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మంచిరోజులు వస్తున్నట్లు కనిపిస్తోంది. ఈసీఐఎల్‌లోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిని మార్చడంతో మహర్దశ కలిగినట్లైంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరిన్ని పెరగనున్నాయి.

వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ ఆసుపత్రిలో పడకల సంఖ్యను పెంచడంతో పాటు దానికి తగ్గట్టుగా అన్నీ వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మల్కాజిగిరి ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో ప్రస్తుతం 70 పడకలు ఉండగా.. ఆ సంఖ్యను 220 పడకలకు పెంచారు.

అదనపు సిబ్బంది నియామకం..

మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన పడకల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటికే 94 మంది డాక్టర్లను నియమించారు. ఇందులో మెడికల్ కాలేజీకి సంబంధించిన డాక్టర్లు 49 మంది ఉండగా.. వైద్యారోగ్యశాఖ డాక్టర్లు 45 మంది ఉన్నారు. దీనికి తగ్గట్టుగా స్టాఫ్ నర్సులను కూడా నియమించేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల సంఖ్య 30 ఉండగా.. ఆ సంఖ్యను 100కు పైగా పెంచేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది.

ప్రజలకు అందుబాటులో మరిన్ని సేవలు..

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అనాటమీ, బయోకెమిస్ట్రీ, పిజీయాలజీ, సైకాలజీ ,పాథాలజీ, మైక్రోబయాలజీ, గైనకాలజీ , పిడియాట్రీక్స్, జనరల్ సర్జన్, మెడిసిన్, సైకాలజీ, అర్థోపెటిక్, ఈఎన్టీ, అప్తమాలజీ, రేడియాలజీ డిపార్ట్‌మెంట్లు ఉండటంతో దీనికి సంబంధించిన విభాగాలు మల్కాజిగిరి జనరల్ ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుకానుండటంతో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందనున్నాయి.

అదనపు పరికరాలతో పెరగనున్న వసతులు..

డయాగ్నస్టిక్‌హబ్‌తో పాటు రేడియాలజీకి సంబంధించిన విభాగాలు కూడా త్వరలో ఆసుపత్రికి రానున్నాయి. మరో రెండేళ్లలో మల్కాజిగిరి ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ల సంఖ్యతో పాటు వైద్యసేవల పరంగా మరిన్ని వసతులు ఏర్పడే అవకాశం ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అవసరమైన సదుపాయాలతో పాటు కావాల్సిన పరికరాలు, పారామెడికల్, వైద్య సిబ్బంది సంఖ్య కూడా పెంచనున్నారు.

అల్వాల్ సూపర్ స్పెషల్ ఆసుపత్రితో..

నియోజకవర్గ పరిధిలోని అల్వాల్‌లో నిర్మిస్తున్న టీమ్స్ (సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వాసుపత్రి) పూర్తైతే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు సముచిత స్థాయిలో వైద్యసేవలు అందించగలమని, ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

మూడు సీహెచ్‌సీలు..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఘట్కేసర్, మేడ్చల్, శామీర్‌పేట్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లు, 28 యూపీహెచ్‌పీసీలు, 12 పీహెచ్‌పీలు, 112 బస్తీ దవాఖానాలు, 69 పల్లె దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కీసర, జవహర్ నగర్, అల్వాల్, బాలానగర్, మల్లాపూర్, షాపూర్ నగర్‌లోని ఆరోగ్యకేంద్రాల్లో ప్రజలకు 24 గంటల వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటుంది.

- నారపల్లి ,కుషాయిగూడ, ఎంసీపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్, పర్వతా నగర్, వెంకట్‌రెడ్డినగర్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గర్భిణులకు ప్రసవాలను నిర్వహిస్తున్నట్లు వైద్యశాఖ తెలిపింది.
- ఈసీఐఎల్‌లో మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేశారు. జిల్లాలో కొనసాగుతున్న బస్తీ,పల్లె దవాఖానాలు, సీహెచ్‌పీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్యశాఖ సేవలందిస్తోంది.



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన వైద్యసేవలు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే ప్రైవేటరంగంలో 7 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఈసీఐఎల్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింత పెరిగే అవకాశం ఉంది.
- డా. రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్‌ఓ

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు..
టమాట రూ. 29, వంకాయ రూ. 28, బెండ రూ. 28, పచ్చిమిర్చి రూ. 33, కాకర రూ. 23, బీర రూ. 38, క్యాబేజి రూ. 19, ఫ్రెంచిబీన్స్ రూ. 35, క్యారట్ రూ. 47, దొండ రూ. 23–28, చిక్కుడు రూ. 45, గోకర రూ. 23, బీట్‌రూట్ రూ. 40, క్యాప్సికం రూ. 55, ఆలు రూ. 36, దోస రూ. 18, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 13, ఉల్లిగడ్డ రూ. 48, చామ గడ్డ రూ. 35.
ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఏసీపీకి సీపీ పరామర్శ


కృష్ణయ్యతో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

నాగోలు: కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యను రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు శనివారం పరామర్శించారు. కృష్ణయ్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. సీపీ వెంట ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.
మన్సూరాబాద్: అనారోగ్యంతో కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యను రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి శనివారం పరామర్శించారు. ఏసీపీ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

గిరిజన సమస్యలను పరిష్కరించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

లింగోజిగూడ: గిరిజన సమస్యలను పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో గిరిజనుల 10 శాతం రిజర్వేషన్ చేర్చాలని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొర్ర మోతీలాల్ నాయక్ కోరారు. సేవాలాల్ బంజారా సంఘం వార్షికోత్సవ పోస్టర్‌ను శనివారం కర్మన్‌ఘాట్‌లోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన తండాలను గ్రామ పంచాయితీలుగా చేసి, ప్రతి గ్రామానికి రూ.5 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, గాంధీనాయక్, సక్రి బాయి, చందు నాయక్, రామ్‌లాల్‌నాయక్, రాజేష్‌నాయక్, జుక్కి బాయి, శాంతిబాయి, సరిత బాయి పాల్గొన్నారు.

వ్యాపారి హత్యకేసులో నలుగురి రిమాండ్



లింగోజిగూడ: వ్యాపారి హత్య కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భాగ్యలత అరుణోదయ కాలనీలో నివాసముండే యాకలి కాశీరావు కార్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాశీరావు అద్దెకుంటున్న మొదటి అంతస్తులో అంతమ్మగూడెంకు చెందిన ఐతరాజు శంకర్, గట్టుప్పల్‌కు చెందిన పెద్దగాని శేఖర్, హయత్‌నగర్‌కు చెందిన పెద్దగాని సాయిలు అద్దెకు ఉంటున్నారు. శంకర్, సాయిలు హయత్‌నగర్ బొమ్మల గుడి వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తుండగా శేఖర్ కాశీరావుతో కలిసి కార్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు.వీరితో పాటు వీరి స్నేహితుడు హయత్‌నగర్ చెందిన భావనసాయి ప్రసన్న అప్పుడప్పుడు వీరి ఇంటికి వచ్చి వెళ్లేవాడు.జల్సాలకు అలవాటు పడిన నలుగురు కాశీరావు నుంచి పలుమార్లు సుమారు రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. గతేడాది కాలంగా తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వకపోవడంతో వారి నడుమ పలుమార్లు గొడవ జరిగింది. అప్పు ఎగ్గొట్టాలనే ఉద్దేశంతో కాశీరావును హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ముందుగానే పెప్పర్‌స్ప్రే, సర్జికల్ బ్లేడ్‌ను ఇంట్లో తెచ్చి పెట్టుకున్నారు. ఈ నెల 3న అప్పు అడిగేందుకు పైకి వెళ్లిన కాశీరావు కాళ్లు, చేతులు పట్టుకుని సర్జికల్ బ్లేడ్‌తో గొంతు కోయగా కాశీరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కాశీరావు భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా శంకర్, శేఖర్, సాయి, ప్రసన్న కలిసి హత్య చేసినట్లు నిర్ధారణ కావడంతో శనివారం రిమాండ్‌కు తరలించారు.

మరో కేసులో ఒకరు..

చాదర్‌ఘాట్: రెండ్రోజుల క్రితం అజంపురా చమన్ వద్ద గంజాయి మత్తులో పలువురి నడుమ జరిగిన గొడవలో ఒకరు మృతి చెందిన సంఘటనలో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు వివరాల ప్రకారం.. గంజాయి మత్తులో ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో అకిల్ (24)ను బందరాయితో హత్య చేసిన ముస్తాఫా (34)ను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు రాజు తెలిపారు.

సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యం

లింగోజిగూడ: ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు.ఎల్‌బీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన గేట్ ఎల్‌బీనగర్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కార్పొరేటర్ దృష్టికి రావడంతో ఆయన పాఠశాల వెనుక భాగంగా సీఎం రోడ్డులో నూతన గేటు ఏర్పాటు చేయించారు. శనివారం పాఠశాల సిబ్బంది, స్థానిక కాలనీల వాసులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గేటు ఏర్పాటుకు సహకరించిన జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, కృష్ణరెడ్డి, జైరాం, శ్రీనివాస్, అస్లాం, జైపాల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, విష్ణు, సుధీర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల గేటును ప్రారంభిస్తున్న రాజశేఖర్‌రెడ్డి


నేడు ఉచిత వైద్య శిబిరం

నాగోలు: జైపురికాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు నాగోలు సుప్రజ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్యామల యాదగిరి ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని ఆయన వెల్లడించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి ఇందిరానగర్ కాలనీలోని సీసీ రోడ్డును తవ్వి చేపడుతున్న నిర్మాణంపై చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరారు. శనివారం పలువురు మాట్లాడుతూ.. కాలనీకి చెందిన పలువురు సీసీ రోడ్డును సుమారు 2.5 ఫీట్ల మేర ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ప్రశ్నించిన కాలనీ వాసులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు వినతిపత్రం అందజేశామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన రాజు

నాగోలు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..తట్టిఅన్నారం, ఆర్‌కేనగర్‌కు చెందిన మల్లేపాక కృష్ణ బంధువైన వనరుల రాజు(48) గత కొంత కాలంగా ఆయన గదిలో ఉంటున్నాడు. 20 ఏళ్ల నుంచి భార్య పిల్లలను వదిలేసి ఒంటరిగా ఉంటున్నాడు. గత రెండు నెలల క్రితం ఆర్‌కేనగర్‌కు వచ్చి కృష్ణ వద్ద ఉంటున్నాడు. ఆర్యోగం బాగాలేదని చెప్పి ఈ నెల 3న గాంధీ ఆస్పత్రికి వెళ్లి వచ్చాడు. ఈ నెల 6న రాత్రి పడుకున్న రాజు శనివారం ఉదయం లేవలేదు. దగ్గరికి వెళ్లి చూడగా మృతి చెందినట్లు నిర్ధారించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

ఉరేసుకుని...

చంచల్‌గూడ: ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. మహ్మద్ అహ్మద్ (50) సేల్స్‌మెన్‌గా పని చేస్తుంటాడు. మద్యానికి బానిసై నిత్యం డబ్బుల కోసం ఇంట్లో గొడవ పడేవాడు. ఇటీవల ఉద్యోగం కూడా మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. మద్యానికి డబ్బులు ఇవ్వకపోతే చనిపోతానని బెదిరించేవాడు. ఈ క్రమంలో గత బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

దివ్యాంగుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం


విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న మంత్రి సీతక్క

మంత్రి సీతక్క

చాదర్‌ఘాట్: దివ్యాంగుల పింఛన్ల పెంపు, ఇతర సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. మలక్‌పేట బధిరుల ఆశ్రమ పాఠశాల, మాసాబ్‌ట్యాంక్‌లోని అంధుల పాఠశాల, సరూర్‌నగర్‌లోని వికలాంగుల పాఠశాలలో కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో కలిసి శనివారం ఆమె దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూగ చెవిటి విద్యార్థులకు కేవలం పదో తరగతి వరకు ప్రత్యేక పాఠశాలలు ఉన్నాయని త్వరలో ఇంటర్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వికలాంగులకు పింఛన్లు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో వేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, వికలాంగుల శాఖ డైరెక్టర్ శైలజ పాల్గొన్నారు.

తులం బంగారం ఇవ్వాలి

- కల్యాణలక్ష్మి పథకంపై ప్రభుత్వ వైఖరి సరికాదు
- ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేసి చేతులు దులుపుకొంటే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆగ్రహించారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం అందజేయాలని డిమాండ్ చేశారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితారెడ్డి విచ్చేసి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకు వచ్చారని గుర్తు చేశారు. అందులో భాగంగానే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పురుడు పోసుకుందన్నారు. ఇంట్లో ఎదిగిన ఆడపిల్లకు పెళ్లి చేసి తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో నాడు కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకు వచ్చారన్నారు. పథకం కింద ఇచ్చే రూ.లక్షకు తోడుగా తులం బంగారం ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను కాంగ్రెస్ దమ్ముంటే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 113 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సరస్వతి, తహసీల్దార్ ఇందిరాదేవి, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

మీర్‌పేట: కల్యాణలక్ష్మి నగదుతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు శనివారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. 70 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఇందిరాదేవి, కమిషనర్ జ్ఞానేశ్వర్, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 | 9912220363
9505507616 | 9912220365